సాక్షి ఖమ్మం

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



జానపదంలోనే మన మూలాలు

జానపదంలోనే మన మూలాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి సూచించారు. 8లో



మందు.. 'ఫుల్' ఆదాయం!

2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 24-25లో మద్యం అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఆపై గంటగంటకు ఎండ పెరుగుతూ గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



వెదురు డిపో వద్ద వేలాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

ఏన్కూరు: అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(సీసీఎఫ్) బీమానాయక్ అన్నారు. ఇదే సమయాన విద్యుత్ వైర్ల సాయంతో వన్య ప్రాణులను వేటాడాలని యత్నించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఏన్కూరులోని వెదురు డిపో వద్ద వేలంపాట కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అడవులు, వన్యపాణుల పరిరక్షణకు అందరూ పాటుపడుతూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎఫ్ఆర్ఓ ఉమ, డీఆర్ఓ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'భక్త రామదాసు' రెండో మోటార్ సిద్ధం

కూసుమంచి: మండలంలోని భక్తరామదాసు ఎత్తిపోతల ప్రాజెక్టులోని రెండు మోటార్లు గత సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు నీట మునిగాయి. అందులో ఒక మోటార్‌కు మరమ్మతులు చేపట్టి యాసంగి సీజన్ పంటలకు సాగు నీరు అందించారు. ప్రస్తుతం రెండో మోటార్ మరమ్మతులు కూడా పూర్తవడంతో బుధవారం ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈక్రమాన ఎలాంటి ఇబ్బంది లేకుండా నీరు ఎత్తిపోయడంతో ప్రాజెక్టులోని రెండు మోటార్లు సిద్ధమైనట్లేనని ప్రాజెక్టు డీఈ రమేష్‌రెడ్డి వెల్లడించారు.

కార్మికులకు 'ఆయుష్మాన్ భారత్'

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే కాక ఆరోగ్య సంరక్షణలో లోపాల సవరణకు ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన వర్తింపచేయనున్నట్లు జిల్లా ఉపకార్మిక కమిషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్మికుల వివరాలను ఈ–శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు కొనసాగే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిల్వల్లో తేడా ఉంటే చర్యలు



ఎరువులను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

ఖమ్మంరూరల్: ఎరువుల షాపుల్లో అమ్మకాలు, నిల్వల విషయమై రిజిస్టర్లు నిర్వహించాలని, ఏ మాత్రం తేడా వచ్చినా డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య స్పష్టం చేశారు. రూరల్ మండలంలోని తల్లంపాడు, పెదతండాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం తనిఖీ చేసిన ఆయన నిర్వాహకులతో మాట్లాడారు. పీఓఎస్ ద్వారానే అమ్మకాలు చేపడుతూ రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. తొలుత పెదతండాలోని ఎరువుల గోదాంను పరిశీలించిన డీఏఈ.. దిగుమతి, సరఫరా వివరాలు తెలుసుకున్నారు. ఏడీఏ సరిత, మండల ఏఓ ఉమానగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది..



కొంగరలో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

నేలకొండపల్లి: యాసంగిలో సాగు చేసిన పంట కోతలు పూర్తవుతుండడంతో వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం తగ్గిందని ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. నేలకొండపల్లి మండలంలోని కొంగర, ముజ్జుగూడెం, ఆచార్లగూడెం ఫీడర్లకు సంబంధించి కొత్త బ్రేకర్‌ను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలిపారు. అకాల వర్షం, ఈదురుగాలులతో తీగలు తెగిపడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, ఏడీ వై.రమేష్‌కుమార్, ఏడీఏ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగం చేసిన వరుణుడు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. మూడు రోజులుగా అడపా దడపా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. దీంతో కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. అలాగే, కల్లాల్లో ఆరబోసిన మక్కలు తడిసిముద్దవగా.. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. అకాల వర్షం, ఈదురుగాలులతో జిల్లాలోని 56 గ్రామాల్లో 1,782 మంది రైతులకు చెందిన 3,222 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఇప్పటికే ఎకరాకు రూ.10వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యాన రైతులకు కాస్త ఊరట కలగనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఈదురు గాలులకు నేలవాలిన వరి, మొక్కజొన్న

- వర్షంతో కొట్టుకుపోయిన కల్లాల్లోని మక్కలు, ధాన్యం
- మామిడితోటలపైనా తీవ్ర ప్రభావం
- జిల్లాలో 3,222 ఎకరాల్లో పంట నష్టం



తిరుమలాయపాలెం : మిర్చి రాశిలో నీళ్ల తొలగిస్తున్న జింకలగూడెం రైతు

పది బస్తాలు రావడమూ కష్టమే..



కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన ఈ రైతు పేరు కనమతిరెడ్డి వెంకటరెడ్డి. ఏడెకరాల్లో వరి సాగు చేసిన ఈయన ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించాడు. కానీ భారీ వర్షం, ఈదురు గాలులకు పంట పూర్తిగా నేలవాలింది. కింద పడిన వరి పనలు కుళ్లిపోయే అవకాశముంది. ఉన్న కాసిన్ని పనలు కూడా కోయించి నూర్పిడి చేసే పరిస్థితి లేక ఎకరాకు 10 బస్తాలు కూడా రావడం కష్టమేనని వాపోతున్నాడు.

సాయంత్రమైతే చాలు..

ఈనెలారంభం నుంచి వాతావరణంలో మార్పులతో సాయంత్రమైతే చాలు వరుణుడు తన ప్రభావం చూపుతున్నాడు. మంగళవారం కూడా అర్ధరాత్రి 12–30నుంచి 2.30 గంటల వరకు పలుచోట్ల ఈదురుగాలులు, వడగండ్ల వాన కురిసింది. పంట చేతికి అందే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులకు తీరని నష్టం మిగులుతోంది. ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరగా రైతులు ఉత్సాహంగా యాసంగి పంటలు సాగు చేశారు. కానీ ఇప్పుడు అకాల వర్షాలతో వారి ఆనందం ఆవిరవుతోంది.

నేలవాలిన వరి, మొక్కజొన్న

ఈదురుగాలుల కారణంగా వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. సాధారణంగా పంట నిలువుగా ఉన్నప్పుడు హార్వెస్టర్లు ద్వారా కోయిస్తారు. కానీ పంట నేలవాలడంతో మిషన్లను ఉపయోగించడం కష్టంగా మారుతుందని, కూలీలైతే అదనంగా చెల్లించాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఓ వైపు పంట నేలవాలడం, కొంత గింజ రాలిపోవడం కూడా రైతులపై అదనపు భారం పడనుంది.

ఆరబెట్టిన ధాన్యం తడిసి..

కల్లాల్లో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న పంటలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కొనుగోళ్లలో జాప్యంతో రహదారుల వెంట, కల్లాల్లో ఆరబోసిన పంట వర్షానికి కొట్టుకుపోగా రైతులు నష్టపోయారు. ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటుచేసినా కాంటా, తరలింపు ఆలస్యమవుతుండడం.. ఇంతలోనే ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.

3,222 ఎకరాల్లో నష్టం

ఈనెల రెండో వారం వరకు ప్రకృతి వైపరీత్యాలతో వైరా, తల్లాడ, కల్లూరు, మధిర, పెనుబల్లి మండలాల్లో సాగులో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. ఆయా మండలాల్లోని 56 గ్రామాల్లో 1,672 మంది



నేలకొండపల్లి : నీళ్లలో నానిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

రైతులకు చెందిన 2,947 ఎకరాల్లో వరి, 27 మంది రైతులకు చెందిన 37 ఎకరాల్లో మొక్కజొన్న, 79 మంది రైతులకు చెందిన 226 ఎకరాల్లో మామిడి, నలుగురు రైతులకు చెందిన 12ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం జరిగింది. మొత్తం 1,782 మంది రైతులకు చెందిన 3,222 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా, ప్రకృతి వైపరీత్యాల సమయాన 33శాతం పంట నష్టం జరిగితే పరి హారం అందించాలనే నిబంధనలు ఉన్నాయి. ఇందులో భాగంగా ఎకరాకు రూ.10వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినందున, 1,782 మంది రైతులకు పరిహారం అందే అవకాశముంది.

నష్టం మిగిల్చిన వాన.. 8లో

పలు మండలాల్లో పంట నష్టం వివరాలు (ఎకరాల్లో)

మండలం	వరి	మొక్కజొన్న	మామిడి	నువ్వులు	మొత్తం
వైరా	1,437	-	224	-	1,661
తల్లాడ	350	30	-	-	380
కల్లూరు	1,018	06	-	-	1,024
మధిర	-	-	2	-	02
పెనుబల్లి	142	1	-	12	155

భూభారతి.. రెడీ

- నేటి నుంచి మండల కేంద్రాల్లో అవగాహన
- సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు



నేలకొండపల్లిలో సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: భూసమస్యల పరిష్కారం, యజమానులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేలా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గురువారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై రైతులు, ఇతర వర్గాలకు అవగాహన కల్పించడమే కాక వారి సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇదే సమయాన రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేలకొండపల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లోనూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఈ సదస్సులకు ప్రజలు, రైతులు, భూయజమానులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఓ ప్రకటనలో కోరారు.

నేలకొండపల్లిలో తొలి సదస్సు

నేలకొండపల్లి: భూభారతి చట్టం అమలుకు రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేలకొండపల్లి మండలంలోని గ్రామాల్లో గురువారం నుంచి సదస్సులు మొదలుకానున్నాయి. తొలి సదస్సు గురువారం నేలకొండపల్లిలో నిర్వహించనుండగా వాసవీ భవన్‌లో ఏర్పాట్లుచేశారు. ఈమేరకు ఏర్పాట్లను తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివ తదితరులు పరిశీలించారు. కాగా, సదస్సు విషయమై రైతులు, ప్రజల్లో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు.

షెడ్యూల్ ఇలా...

మండల కేంద్రాల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. నిర్ణీత తేదీల్లో రోజుకు రెండేసి మండలాల్లో ఉదయం, మధ్యాహ్నం సదస్సుల నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు. తొలిరోజైన 17వ తేదీ(గురువారం)న నేలకొండపల్లిలో ఉదయం 9గంటలకు సదస్సు మొదలవుతుంది. అలాగే, 19న తిరుమలాయపాలెం, కూసుమంచి, 21న ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, 22న రఘునాథపాలెం, ముదిగొండ, 23న మధిర, ఎర్రుపాలెం, 24న చింతకాని, బోనకల్, 25న వైరా, ఏన్కూరు, 26న కొణిజర్ల, కారేపల్లి, 28న సత్తుపల్లి, వేంసూరు, 29న కల్లూరు, పెనుబల్లి, 30న తల్లాడ, కామేపల్లిల్లో సదస్సులు నిర్వహిస్తారు.

భూభారతిపై సంపూర్ణ అవగాహన

ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన భూభారతి చట్టంపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం ఆమె రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భూహక్కుల భద్రత, సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టంపై తహసీల్దార్లు అవగాహన కలిగి ఉండి, మండల, గ్రామ స్థాయి ఉద్యోగులకు వివరిస్తూనే సదస్సుల్లో రైతులకు వివరించాలని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేలకొండపల్లి మండలంతో పాటు ఇతర మండల కేంద్రాల్లోనూ గురువారం నుంచి అవగాహన సదస్సుల నిర్వహణకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే, తహసీల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. అనంతరం చట్టంలోని పలు అంశాలపై ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్‌గౌడ్, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత



సునీత - నరేష్‌ను సన్మానించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ, డీడబ్ల్యూఓ, అధికారులు

రఘునాథపాలెం: ఆడపిల్ల పుట్టడంతో ఇంటికి పరిపూర్ణత వస్తుందనే విషయాన్ని గ్రహించి అమ్మాయిలను భారంగా కాకుండా వరంలా భావించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. రఘునాథపాలెంకు చెందిన వాంకుడోత్ సునీత–నరేష్ దంపతులు ఇటీవల ఆడశిశువుకు జన్మనివ్వగా, 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా వారిని ఇన్‌చార్జ్ కలెక్టర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి, ఎంపీడీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల రక్షణ కమ్యూనిస్టుల బాధ్యత



శ్రీకాంత్ సంస్మరణ సభలో మౌనం పాటిస్తున్న రాఘవులు, జాన్‌వెస్లీ, పోతినేని, నున్నా నాయకులు

- సీపీఎం 24వ మహాసభల తీర్మానాల ఆధారంగా పోరాటాలు
- యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభలో బీ.వీ.రాఘవులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాహక్కుల పరిరక్షణను కమ్యూనిస్టులు బాధ్యతగా భావిస్తారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీ.వీ.రాఘవులు తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవల మధురైలో జరిగిన పార్టీ 24వ ఆలిండియా మహాసభల్లో ఆహారం, ఇల్లు, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛన్లు దేశంలోని పౌరులందరి హక్కులుగా చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ తీర్మానాల అమలుకు ఉద్యమాలు నిర్వహించాలని శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. మధురైలో సభలకు హాజరై గుండెపోటుతో మృతి చెందిన ఖమ్మంకు చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ సంస్మరణ సభ ఖమ్మంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సభలో రాఘవులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తే కార్మికులు సంక్షేమ ఫలాలు కోల్పోనున్నందున వచ్చేనెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామని తెలిపారు. అలాగే, నూతన వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని చెప్పారు. కాగా, హక్కుల సాధనకు ఉద్యమిస్తూ, ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడమే శ్రీకాంత్‌కు నిజమైన నివాళి అని తెలిపారు.

కష్టాలొస్తే గుర్తొచ్చేది కమ్యూనిస్టులే..

ప్రజలకు ఏ కష్టం వచ్చినా కమ్యూనిస్టులు అండగా నిలుస్తున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. మంత్రి పదవి ఇవ్వకపోతే సంగతి చూస్తామని సీఎంను హెచ్చరించడం.. అలాంటి వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చెబుతున్నారంటే పార్టీ శ్రేణులు గీత దాటే పరిస్థితులు వచ్చినట్టేనని చెప్పారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు అమలు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పోరాడాల్సిన దశలో ప్రజా మన్ననలు పొందిన శ్రీకాంత్ దూరం కావడం నష్టదాయకమని తెలిపారు. ఈ సభలో సీపీఎం ఏపీ, తెలంగాణ, ఉమ్మడి జిల్లా నాయకులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, సీహెచ్.బాబూరావు, బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, యర్రా శ్రీకాంత్ సతీమణి సుకన్య, కుటుంబీకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు దండి సురేష్, యర్రా బాబు, రామాంజనేయులు, పునుకొల్లు నీరజ, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, గుర్రం ఉమామహేశ్వరరావు, మెంతుల శ్రీశైలం, చిన్ని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


వానాకాలం వచ్చేలోపు మరమ్మతులు

- సాగునీటి కాల్వలు, చెరువుల ఆధునికీకరణపై దృష్టి
- రూ.10 కోట్ల పనులకు ప్రణాళిక

ఖమ్మంఅర్బన్: వచ్చే వానాకాలం సీజన్ నాటికి పంటలకు అవాంతరాలు లేకుండా సాగునీరు సరఫరా చేయడంపై జలవనరుల శాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం పంటలు చివరి దశకు చేరడం, సాగునీటి సరఫరా నిలిపివేసిన నేపథ్యాన కాల్వలు, తూములు, కట్టలను బలపర్చడం తదితర పనులు చేపట్టేలా కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే కొన్ని పనులు గుర్తించగా, వాటికి అంచనాలు రూపొందించి టెండర్లు పూర్తిచేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే వచ్చే వానాకాలం సీజన్‌లో నీరు సాఫీగా ముందుకు సాగి రైతులకు ఇక్కట్లు ఉండవని భావిస్తున్నారు.

ఇదే అదును...

ఏటా ఆయకట్టు ఆధారంగా జలవనరుల శాఖ ద్వారా సుమారు రూ.10 కోట్ల విలువైన పనులను చేపడుతారు. పంట విరామం సమయమైన ఏప్రిల్ నుంచి జూలై వరకు పనులు పూర్తిచేసేలా ప్రణాళిక ఉంటుంది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో సాగర్ ప్రధాన కాల్వ, మేజర్లు, మైనర్లతో పాటు, చెరువులు, కుంటల పరిధి, ఎత్తిపోతల పథకాల



ధంసలాపురం చెరువు అలుగు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

పరిధిలో ఈసారి కూడా అవాంతరాలు ఉన్న చోట్ల సరిదిద్దేలా పనులు చేపడతారు. అయితే, ఈ పనులకు నిర్దేశించిన నిధుల లక్ష్యం దాటితే రాష్ట్ర కమిటీ ద్వారా అదనంగా మంజూరు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకైతే జిల్లాలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేలా గుర్తించినట్లు తెలిసింది. సీఈ ద్వారా రూ.5కోట్లు, ఇద్దరు ఎస్ఈల ద్వారా రూ.కోటి చొప్పున, ఆరుగురు ఈఈల పరిధిలో రూ.25 లక్షల చొప్పున పనులు చేయించడమే కాక మిగతా నిధులను 21మంది డీఈల పరిధిలో వెచ్చిస్తారు.

ఏమేం పనులు...

సాగర్ కాల్వల పరిధిలో కట్టడాల మరమ్మతులు, యూటీలు, ఓటీలు, క్రాస్ రెగ్యులేటర్ల మరమ్మతులు చేయనున్నారు. అలాగే, కాల్వలు, చెరువుల షట్టర్ల మరమ్మతు, కట్టలపై కంపచెట్లు తొలగింపు, పూడికతీత, కట్టలు బలపర్చే పనులు కూడా జాబితాలో ఉన్నాయి. ఇక చెరువుల పరిధిలో పూడికతీత చేపట్టి రైతులు తమ పొలాలకు ఒండ్రుమట్టి తరలింపునకు అనుమతి ఇస్తారు. ఇవేకాక ఎత్తిపోతల పథకాల వద్ద కూడా అవసరమైన మరమ్మతులను గుర్తించి పనులు చేపడుతారు.

టెండర్లు కొనసాగుతున్నాయి..

సాగర్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. కాల్వలు, చెరువులు, ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఇప్పటికే సమస్యలు గుర్తించిన చోట మరమ్మతులకు సిద్ధమవుతున్నాం. కొన్ని పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. పనులన్నీ వర్షాకాలం మొదలయ్యేలోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

– ఎం.వెంకటేశ్వర్లు, జలవనరులశాఖ ఎస్ఈ

మామిడి మార్కెట్ సిద్ధం

రోటరీనగర్‌లో 35 స్టాళ్ల ఏర్పాటు



స్టాళ్ల ఏర్పాటుకు చేసిన మార్కింగ్

దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులే మామిడి పండ్లు విక్రయించుకునేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో ఖమ్మం రోటరీ నగర్‌లోని వీధివ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాట్లుచేశారు. ఇన్నాళ్లు మార్కెట్ లేక మధ్యవర్తులకు అమ్ముతున్న రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో దాదాపు 33వేల ఎకరాల్లో మామిడి సాగవుతుండడంతో మార్కెట్ ఆవశ్యకతను గుర్తించిన కలెక్టర్ రోటరీనగర్ వీధివ్యాపారుల ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. రైతులు తాము పండించిన పంటను రైపెనింగ్ చాంబర్లలో మాగించి కార్బైడ్ రహిత పండ్లను ఇక్కడ విక్రయించాల్సి ఉంటుంది. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రాంగణానికి రంగులు వేసి 35 మంది రైతులు విక్రయించుకునేలా మార్కింగ్ కూడా చేశారు. ఈ మార్కెట్‌లో అమ్మకాలు ఒకటి, రెండు రోజుల్లో మొదలుకానున్నాయి.

–ఖమ్మంవ్యవసాయం

క్లుప్తంగా

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన ఎండీ షౌకత్‌అలీ కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా ద్వారా రూ.8 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కును ఆయన కుటుంబీకులకు బుధవారం సీపీ సునీల్‌దత్ అందజేశారు. కార్యక్రమంలో ఏఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

10 మంది స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీ

ఖమ్మంసహకారనగర్: గత ప్రభుత్వ హయాంలో 317 జీఓ ద్వారా ఉపాధ్యాయ దంపతుల్లో ఒక్కొక్కరు ఒక్కో జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో వీరికి స్పౌజ్ కేటగిరీ ద్వారా బదిలీకి అవకాశం కల్పించగా రాష్ట్రంలో 165మంది ఉపాధ్యాయులను వారి భాగస్వామి పనిచేస్తున్న జిల్లాలకు కేటాయించారు. ఇందులో పది మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రానుండగా, అంతే సంఖ్య ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్లనున్నారు. బుధవారం ఉత్తర్వులు విడుదల చేయడంపై టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయా ఉపాధ్యాయులు ఈనెల 22న ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ అయి 23న రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం ముద్దులపల్లికి చెందిన ఎటుకూరి లక్ష్మణ్‌రావు వద్ద ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన వ్యాపారి మల్లెల నర్సింహారావు మూడు దఫాలుగా రూ.21 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో 2021 సెప్టెంబర్‌లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చినా ఖాతాల్లో సరిపడా నగదు లేక చెల్లలేదు. దీంతో లక్ష్మణ్‌రావు న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం నర్సింహారావుకు ఏడాది జైలుశిక్ష విధించడమే కాక రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

మృతి చెందిన రిటైర్డ్ పోలీస్ కుటుంబాలకు చేయూత

ఖమ్మంక్రైం: వివిధ కారణాలతో మృతి చెందిన విశ్రాంత పోలీస్ అధికారుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు విశ్రాంత అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ బుధవారం తెలిపారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ చేయూత మే 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఇందుకోసం ప్రతీ రిటైర్డ్ ఉద్యోగి నెలకు రూ.300 జమ చేసేలా తీర్మానించామని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి, సంజీవరావు, సోమయ్య, నాగేశ్వరరావు, జయాకర్, ఖాసీం, దస్తగిరి, హరిసింగ్, రామచంద్రరాజు, దావీదు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	5,800
కందులు	6,900	6,300
మినుములు	6,850	6,850
మిర్చి	13,400	6,000
తాలు మిర్చి	5,600	3,900
పత్తి	7,450	5,000

- ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.21,000

నష్టం మిగిల్చిన వాన..



వైరారూరల్: వర్షానికి తడిసిన ధాన్యం రాశులు



కొణిజర్ల : కింద పడ్డ వరిపనలు చూపుతున్న రైతులు



తల్లాడ : బిల్లుపాడులో తడిసిన ధాన్యం



పెనుబల్లి : అకాల వర్షానికి నేలవాలిన వరి పైరు



కూసుమంచి : పాలేరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



ఖమ్మంవ్యవసాయం: మార్కెట్‌లో మిర్చి బస్తాలు తడవకుండా టార్పాలిన్లతో రక్షణ



ముదిగొండ: కమలాపురంలో మొక్కజొన్నలు ఆరబెడుతున్న రైతు



తల్లాడ: తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కొణిజర్ల: మండల కేంద్రంతో పాటు పెద్దగోపతి, పెద్దమునగాల, కాచారం, కొండవనమాల తదితర గ్రామాల్లో వరి పంట వర్షం, ఈదురుగాలులకు నేల కొరిగింది. గింజ పాలు పోసుకునే దశలో ఈ పరిస్థితి ఎదురవడంతో సగానికి పైగా దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో నీటి సరఫరా నిలిపివేయడంతో ఇబ్బంది పడుతుండగా, ఇప్పుడు ప్రకృతి మరింత కన్నెర్ర చేసింది.

వేంసూరు: మండలంలో వర్షం కారణంగా ధాన్యం రాశులపై కప్పిన పట్టాలపై నీరు నిలవగా ఆరబెట్టిన ధాన్యం తడవడంతో పాటు మామిడి కాయలు నేలరాలాయి.

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు, జింకలగూడెం, పిండిప్రోలు, కొక్కిరేణి, బీరోలు తదితర గ్రామాల్లో పంటలు తడిసిముద్దయ్యాయి. ధాన్యం, మిర్చి, మొక్కజొన్న రాశులు తడిశాయి. తద్వారా మిర్చి రంగు మారుతుందని, మొక్కజొన్న నాణ్యత తగ్గనున్నందున ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

తల్లాడ: మండలంలో వర్షంతో కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. తల్లాడ, రేజర్ల, గొల్లగూడెం, బిల్లుపాడు, అన్నారుగూడెం, మల్లవరం, తెలగవరం, నూతనకల్, మిట్టపల్లిల్లో తేమ శాతం వచ్చినా కాంటా వేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ఇక మామిడి తోటల్లో కాయలు గాలివానకు రాలాయి.

పెనుబల్లి: మండలంలోని లింగగూడెం, ఏరుగట్ల, భవన్నపాలెం, చౌడవరం, పార్థసారథిపురం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో వరి నేలమట్టమైంది. చేతికొచ్చిన పంట నేలపాలైనందున తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేలకొండపల్లి: మండలంలోని నేలకొండపల్లి, చెరువుమాధారం, మంగాపురం, ముజ్జుగూడెం, పైనంపల్లిల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. ధాన్యం కాంటా వేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు.

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో బుధవారం ఉదయం నుంచే రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంలో నిమగ్నమయ్యారు.

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలను తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పి రక్షించుకున్నారు.

వైరారూరల్: గరికపాడు, దాచాపురంలలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిచాయి. కొన్నిచోట్ల రైతులు ముందుగానే కప్పిన పట్టాలపైనా నీరు నిలిచింది.

ముదిగొండ: పలు గ్రామాల్లో వర్షంతో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.

రఘునాథపాలెం: కొత్తగూడెం, ధంసలాపురం, గోపాలపురం, గణేశ్వరం, చింతగుర్తి తదితర గ్రామాల్లో వరితో పాటు మొక్కజొన్న, బొప్పాయి, మామిడి తోటలకు నష్టం జరిగిందని రైతులు వాపోయారు.

మందు.. 'ఫుల్' ఆదాయం

- 2023-24తో పోలిస్తే 24-25లో పెరిగిన అమ్మకాలు
- 2024 మే నెలలో రూ.237 కోట్ల మద్యం అమ్మకాలతో రికార్డు
- మొత్తంగా ఆర్థిక సంవత్సరంలో రూ.2,294 కోట్ల సేల్స్



వైరాలోని మద్యం డిపో

2024-25 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు

నెల	విక్రయాలు (రూ.కోట్లలో)
2024 ఏప్రిల్	181
మే	237
జూన్	210
జూలై	180
ఆగస్టు	196
సెప్టెంబర్	184
అక్టోబర్	152
నవంబర్	134
డిసెంబర్	225
2025 జనవరి	201
ఫిబ్రవరి	181
మార్చి	201
మొత్తం	రూ.2,294

వైరా: మద్యం అమ్మకాలు ఏటేటా పెరుగుతుండగా.. ప్రభుత్వానికి అంతే మొత్తంలో ఆదాయమూ పెరుగుతోంది. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో వైరాలోని ఐఎంఎల్ డిపో ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైన్స్, బార్లకు రూ.2,294 కోట్ల విలువైన మద్యం సరఫరా కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో 210 వైన్స్, మూడు క్లబ్‌లు, 50 బార్లు ఉన్నాయి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,281 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగగా, 2024-25కు వచ్చేసరికి అమ్మకాలు మరింత పెరిగాయి. సహజంగా ఏటా వేసవిలో బీర్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇందులో భాగంగానే గత ఏడాది మే నెలలో రూ.237 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందుకు ప్రధాన కారణం ఆ నెలలో శుభకార్యాలు ఉండటం, ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు ఏపీలో ఎన్నికల నేపథ్యాన ఇక్కడి నుంచి మద్యం సరఫరా అయిందని తెలుస్తోంది. ఇక గత ఏడాది సెప్టెంబర్ 30న ఒకేరోజు 45 వేల కేసుల మద్యం, 16,500 కేసుల బీర్లు అమ్ముడవడం .. వీటి విలువ రూ.33 కోట్లు ఉండడం విశేషం.

పెరిగిన బీర్ల ధరలు.. తగ్గిన డిమాండ్

ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచడంతో వేసవిలో బీర్ల అమ్మకం ఎలా ఉంటుందోనని మద్యం షాపుల యజమానుల్లో అనుమానం వ్యక్తమవుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి బీర్లకు అంతగా డిమాండ్ లేనట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలో స్ట్రాంగ్ బీర్ ధర రూ.160 ఉండగా ఇప్పుడు రూ.190కి, లైట్ బీరు రూ.150 నుంచి రూ.180కి చేరింది. గతంలో రోజుకు 8 వేల నుంచి 10 వేల కేసులు అమ్ముడయ్యే బీర్లు 7 వేల కేసులు దాటడం లేదని చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12 నుంచి పెరిగిన బీర్ల ధరలు అమల్లోకి రాగా ఈ నెల 11వ తేదీ వరకు రూ.60 కోట్ల విలువైన 2,92,000 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అయితే, బీర్లకు డిమాండ్ తగ్గినా లిక్కర్ అమ్మకాలు జోరుగా సాగుతుండడంతో ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం గణనీయంగా నమోదయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

మూడు నెలల్లో రూ.600 కోట్లు తాగేశారు!

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలోని మద్యం ప్రియులు గడిచిన మూడు నెలల్లో రూ.600 కోట్ల విలువైన మద్యం తాగేశారు! ఇందులో అగ్రస్థానం మద్యందే కాగా.. బీర్లు రెండో స్థానానికి పడిపోయాయి. జనవరి నుంచి మార్చి వరకు పరిశీలిస్తే.. జనవరిలో రూ.201 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. ఇక ఫిబ్రవరిలో రూ.210 కోట్లు, మార్చిలో రూ.201 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. అయితే, జనవరి, ఫిబ్రవరిలో మద్యం అమ్మకాలు అగ్రస్థానంలో ఉండగా, మార్చికి వచ్చేసరికి ఎండల కారణంగా బీర్ల అమ్మకాలు పైకి చేరాయి. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఇదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. కానీ గత వేసవిలో బీర్ల కొరత ఏర్పడింది. చాలా బ్రాండ్ల బీర్లు లభించక మద్యం ప్రియులు అల్లాడిపోయారు. ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఎక్సైజ్ శాఖ ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు సమాచారం.

జీపీఓల విధులపై 19న సెమినార్

ఖమ్మంసహకారనగర్: గ్రామ పాలన ఆఫీసర్ల (జీపీఓ) 'విధులు – బాధ్యతలు'అంశంపై ఈ నెల 19న ఖమ్మంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేందర్‌రావు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థకు కొత్త రూపం ఇస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంలోని అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు జీపీఓలుగా వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చిన ఉమ్మడి జిల్లాలోని వీఆర్వోలు, వీఆర్ఏలు హాజరుకావాలని సూచించారు.

జానపదంలోనే మన మూలాలు..

తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి



బిరుదురాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలాచారి, తదితరులు

ఖమ్మంసహకారనగర్: సాహిత్య అధ్యయనం, పరిశోధకులతో మానవ జీవితంలోని జీవనాంశాలు అర్థం చేసుకోవచ్చని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అన్నారు. ఇదే సమయాన మన మూలాలు జానపదంలో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. జానపద సాహిత్య, విజ్ఞాన పరిశోధక బ్రహ్మ ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో విభిన్నమైన సాహిత్యకారుడిగా నిలిచిన బిరుదురాజు స్ఫూర్తిగా విద్యార్థులు సాహిత్యపఠనం, పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ గన్నమరాజు మనోహర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడారు. ఇంకా ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి, రవిమారుత్, ప్రసేన్, డాక్టర్ ఎం.సునంద, యాకూబ్, సమత శ్రీధర్, డాక్టర్ సీతారాం, డాక్టర్ మంథని శంకర్, డాక్టర్ జె.అనురాధ, కపిల భారతి, వాహెద్, కిరణ్, కోటమ్మ, ఎం.వీ.రమణ, కార్తీక్, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల వ్యవధిలో దంపతుల మృతి



దిండు ఉపేందర్ (ఫైల్)



పద్మ (ఫైల్)

తిరుమలాయపాలెం: మూడు రోజుల కిందట గుండెపోటుతో భర్త మృతి చెందడాన్ని తట్టుకోలేక భార్య కూడా గుండెపోటుతోనే మృతి చెందిన ఘటన తిరుమలాయపాలెం మండలంలోని ఏలువారిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దిండు ఉపేందర్ గత సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆవేదనతో ఉన్న ఆయన భార్య పద్మ (50)ను తిరుమలాయపాలెంకు చెందిన అన్న తురక వెంకన్న తమ ఇంటికి తీసుకొచ్చాడు. అయితే, ఉపేందర్ చిన్న కర్మ చేయాల్సి ఉండడంతో బుధవారం ఏలువారిగూడెం వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఆమెకు గుండెపోటు వచ్చింది. దీంతో సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో దంపతుల మృతితో కుటుంబంలోనే కాక గ్రామంలో విషాదాన్ని నింపింది.

'బీజేపీది నిరంకుశపాలన'



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ నిరంకుశ పాలన కొనసాగిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలుకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. తమ పార్టీని నేరుగా ఎదుర్కోలేక నిరాధారమైన ఆరోపణలతో ఈడీని ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు. బిహార్‌లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నిన బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు, నాయకులు మిక్కిలినేని మంజులనరేందర్, మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, పాకాలపాటి విజయనిర్మల, లకావత్ సైదులు, రాపర్తి శరత్, కొప్పెర సరిత, మందడపు లక్ష్మీమనోహర్, గజ్జల లక్ష్మి, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, నాగండ్ల దీపక్‌చౌదరి, పాలకుర్తి నాగేశ్వరరావు, కొత్తా సీతారాములు, బాణాల లక్ష్మణ్, షేక్ రషీద్ పాల్గొన్నారు.

24న మామిడికాయల వేలం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో ఉన్న మామిడి చెట్ల కాయలను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు మేనేజర్ వి.విజేత పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు మొదలయ్యే వేలంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతుకు చేయూత.. కిసాన్ రిమోట్

- 2 కి.మీ. దూరం నుంచే మోటార్ల ఆన్ – ఆఫ్‌నకు అవకాశం
- ఖమ్మం వాసి శ్రీనివాస్ సృజనకు ప్రశంసలు



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



కిసాన్ రిమోట్

ఖమ్మంవ్యవసాయం: కృషి, పట్టుదలకు తోడు అవసరమైన వారికి అండగా నిలవాలనే తపన ఉంటే పెద్ద చదువులేమీ అవసరం లేదని వెల్లె శ్రీనివాస్ నిరూపించారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తిచేసిన ఆయన రైతులకు ప్రయోజనం కలిగేలా వ్యవసాయ మోటార్ల ఆన్ – ఆఫ్ రిమోట్‌ను రూపొందించి పలువురి మన్ననలు అందుకున్నారు. ఖమ్మం మామిళ్లగూడెంలో నివాసముంటున్న శ్రీనివాస్ స్వస్థలం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం కాగా, రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ఎస్సెస్సీ తర్వాత ఇంటర్‌లో ఆర్ అండ్ టీవీ ఒకేషనల్ కోర్సు చేశారు. ఆ తర్వాత టీవీ మెకానిజంలో శిక్షణ పొంది ఆ రంగంలో కొనసాగుతూనే వ్యవసాయం చేశాడు. ఈ క్రమంలోనే మోటార్లతో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన శ్రీనివాస్.. మోటార్ల నిర్వహణకు రిమోట్ రూపొందించారు.

రైతు ప్రయోజనాల కోసం..

వ్యవసాయ మోటార్ల ఆన్, ఆఫ్ వ్యవస్థను రెండు కి.మీ. దూరం నుంచే ఆపరేట్ చేసేలా రిమోట్‌ను శ్రీనివాస్ రూపొందించారు. తద్వారా వర్షం, ఉరుముల సమయాన నేరుగా వెళ్లే బాధ తప్పడంతో ప్రమాదాలు తగ్గనున్నాయి. అంతేకాక ప్రతీసారి పొలం వద్దకు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదు. ఈ మేరకు శ్రీనివాస్ రూపొందించిన 'కిసాన్ రిమోట్'ను 2022లో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి బెస్ట్ ఇన్నోవేటర్‌గా అవార్డు అందించింది. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీకి చెందిన ఆచార్య ఎంజీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు సైతం ఆయనకు గుర్తింపు నిచ్చాయి. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రూ.3 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. దీనికి తోడు పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ ప్రోత్సహించింది. గత వారం హైదరాబాద్ శంకర్‌పల్లిలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, పల్లె సృజన, గ్రామ భారతి సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సన్మానించగా, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గుజరాత్ విభాగం తరఫున ఆర్థిక సాయం అందజేశారు.

3,500 మంది వినియోగం

కిసాన్ రిమోట్‌ను ప్రస్తుతం 3,500 మంది రైతులు వినియోగించుకుంటున్నారని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో తెలంగాణ, ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్ రైతులు ఉన్నారని పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో కిసాన్ రిమోట్లు తయారు చేస్తున్నానని తెలిపారు.

నకిలీ వైద్యులపై చట్టరీత్యా చర్యలు



ఓ ఆర్‌ఎంపీ ఇంట్లో లభించిన మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

చింతకాని: అర్హత లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి హెచ్చరించారు. మండలంలోని తిమ్మినేనిపాలెంలో ఆరోగ్య ఉప కేంద్రంతో పాటు పలువురు గ్రామీణ వైద్యుల క్లినిక్‌లను బుధవారం ఆమె తనిఖీ చేశారు. కాగా, గ్రామంలోని ఇద్దరు ఆర్‌ఎంపీల వద్ద పెద్ద మొత్తంలో మందులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. వీరు ప్రాథమిక చికిత్స తప్ప ఎలాంటి మందులు ఇవ్వొద్దని సూచించారు. అయితే, వీరికి మెడికల్ షాపులే లేకున్నా మెడికల్‌ఏజెన్సీల ద్వారా భారీగా మందులు సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోందని, ఈ విషయాన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, డీఐఓ చందూనాయక్, డీఈఎంఓ సాంబశివారెడ్డి, ఎస్ఎంసీ రవి పాల్గొన్నారు.